



ప్రమాదంలో గాయపడిన కార్మికులను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

స్టీల్‌ప్లాంటులో మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఏం జరిగింది?

ఎంత మంది ఉన్నారు?
పెన్నేపల్లి స్టీల్‌ప్లాంట్ అగ్ని ప్రమాదంపై అయోమయం

పెళ్లకూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఏం జరిగింది? ప్రమాద సమయంలో లోపల ఎంత మంది ఉన్నారు? ఇదీ పెళ్లకూరు మండలం పెన్నేపల్లిలోని ఎంఎస్ అగర్వాల్ స్టీల్ పరిశ్రమలో బుధవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదం నేపథ్యంలో తలెత్తుతున్న ప్రశ్నలు. బయట నుంచి సేకరించే వేస్ట్‌ను కరిగించే ఫర్నేస్ బాయిలర్ పేలడంతో మంటలు చెలరేగాయి. తీవ్రంగా గాయపడిన ఏడుగురు కార్మికుల్లో నాలుగురిని నాయుడుపేట.. ముగ్గురిని నెల్లూరు ఆస్పత్రులకు తరలించారు. వీరంతా బిహార్‌కు చెందిన వారే. గాయపడిన వారిలో రవి బర్వాజ్, సోనూ మహమ్మద్, విశ్వకర్మ, సి.ముని ప్రస్తుతం నాయుడుపేట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా, నైట్ షిఫ్టులో 50 మందికిపైగా ఉన్నట్లు చెబుతున్నారు. అసలు ఎంత మంది లోపల పనిచేస్తున్నారు? బయటకు ఎందరు వచ్చారు? ఎంతమందికి గాయాలయ్యాయనే అంశాలపై బుధవారం రాత్రి 12.40 గంటలకూ స్పష్టత లేకపోవడంతో అయోమయం నెలకొంది. ఏడుగురిని మాత్రం ఆస్పత్రులకు తరలించారు. ప్రమాద సమాచారం తెలియగానే నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, రూరల్ సీఐ సంగమేశ్వరరావు, పెళ్లకూరు ఎస్ఐ నాగరాజు, సిబ్బంది.. తహసీల్దారు ద్వారకానాథరెడ్డి, వీఆర్వో రమేష్ తదితరులు ప్లాంటు వద్దకు చేరుకున్నారు. పరిస్థితిని సమీక్షించారు. యాజమాన్య ప్రతినిధులతో మాట్లాడారు.

విద్యార్థుల పాద పరిమాణాలను నమోదు చేయండి

తిరుపతి(విద్య), జనవరి 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర (ఎస్ఆర్‌కేవీఎం) కిట్‌లను అందించేందుకుగాను వారి పాదాల కొలతలను నమోదు చేయాలని డీఈవో కేవీఎన్ కుమార్ ఆదేశించారు. 1నుంచి 10వ తరగతి విద్యార్థుల పాదాల కొలతలను తీయించి ఎస్ఆర్‌కేవీఎం యాప్‌లో అప్‌లోడ్ చేసే బాధ్యత హెచ్‌ఎంలదేనని తెలిపారు. ఈ నెల 7వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు నమోదు కార్యక్రమం 100 శాతం పూర్తికావాలని స్పష్టం చేశారు. కిట్లలో నోటు పుస్తకాలు, బెల్ట్, బూట్లు, బ్యాగ్, పిక్టోరియల్ డిక్షనరీ, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, టెక్ట్స్ బుక్స్, వర్క్ బుక్స్, మూడు జతల యూనిఫాం క్లాత్‌తోపాటు మరికొన్ని వస్తువులు ఉంటాయని వివరించారు. డేటా ఆన్‌లైన్‌లో నమోదు చేయడమేగాక హార్డ్ కాపీలను డీఈవో కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

'కొత్త' సందడి

నూతన ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని బుధవారం తెల్లవారుజామునే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తొలి రోజున దైవ దర్శనం చేసుకుంటే ఏడాదంతా మంచే జరుగుతుందన్న భావనతో గుళ్లకు వెళ్లారు. పార్కులు.. జలాశయాలు.. కొండా కోనల్లోను ఉత్సాహంగా గడిపారు. 'హ్యాపీ న్యూ ఇయర్' అంటూ పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకొన్నారు.



● ఆధ్యాత్మికం

గోవిందా.. గోవిందా

తిరుమల శ్రీవారి ఆలయ ముందుభాగం మంగళవారం రాత్రి 11 గంటలకే భక్తులు, స్థానికులతో నిండిపోయింది. సరిగ్గా 12 గంటలు కాగానే ఆలయం వైపు తిరిగి శ్రీవారికి నమస్కరించారు. ఒక్కసారిగా గోవింద నామస్మరణలు చేయడంతో ఆ ప్రాంతం మార్మోగింది. కొందరు కళ్లు మూసుకుని ప్రార్థనలు చేస్తూ కనిపించారు. వేకువజాము 4 గంటల వరకు ఆలయం ముందు భక్తుల సందడి నెలకొంది. ఇక, బుధవారం రోజు తిరుమలలో వీఐపీలు మినహా సాధారణ భక్తుల రద్దీ తక్కువగానే కనిపించింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కిక్కిరిసిన ముక్కంటి ఆలయం

శ్రీకాళహస్తీశ్వరాలయం బుధవారం భక్తులతో కిక్కిరిసిపోయింది. సుమారు 28 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,773మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,001మంది దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 977 మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 320, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 84మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 78మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 31మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 27,009 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



● పర్యాటకం

సదాశివకోనలో సందడి

ఏర్పేడు మండలంలోని చెల్లూరు పంచాయతీ వద్ద ఉన్న సదాశివకోన వద్ద ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా సందర్శకులు పోటెత్తారు. జలాశయంలో కేరింతలు కొడుతూ మునిగారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రిజర్వాయర్ జలకళ సంతరించుకుంది.

- ఏర్పేడు, ఆంధ్రజ్యోతి



జలపాత స్నానాలు



తిరుపతి నగరంలోని కపిలతీర్థానికి బుధవారం భక్తులు భారీగా తరలివచ్చారు. పుష్కరిణి వద్ద సెల్ఫీలు దిగారు. జలపాతం వద్ద స్నానాలు చేశారు. కామాక్షి సమేత కపిలేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఇలా.. భక్తులతో రోజంతా సందడి నెలకొంది.

- తిరుపతి (కపిలతీర్థం), ఆంధ్రజ్యోతి

సీఎం, గవర్నర్లకు టీటీడీ వేదాశీర్వచనం

నూతన ఆంగ్ల సంవత్సరం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఉండవల్లిలోని నివాసంలో టీటీడీ వేదపండితులు వేదాశీర్వచనం అందజేశారు. టీటీడీ ఈవో శ్యామలరావు సీఎంకు టీటీడీ డైరీ, క్యాలెండరును అందజేశారు. వేదపండితులు శేషవస్త్రంతో సత్కరించి వేదాశీర్వచనం చేశారు. అలాగే, విజయవాడలోని రాజ్‌భవన్‌లో ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు కూడా టీటీడీ వేదపండితులు ఆశీర్వచనం చేశారు. ఈసందర్భంగా ఈవో శ్యామలరావు శ్రీవారి లడ్డూప్రసాదాలు, డైరీ, క్యాలెండర్లు అందించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



రూ.33.44 కోట్లు!

ఇదీ మూడు రోజుల్లో మందుబాబుల మద్యం ఖర్చు

కొత్త ఆంగ్ల సంవత్సరాదికి మందుబాబులు ఖుషీ చేశారు. మూడు రోజుల్లో దాదాపు రూ.33.44 కోట్ల మద్యాన్ని తాగారు. ఇందులో డిసెంబరు 31వ తేదీన రూ.13.10 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. జిల్లాలో 227 మద్యం దుకాణాలు, 24 బార్లు ఉన్నాయి. 2023 ఏడాది చివర.. డిసెంబరు 30వ తేదీన 7300 కేసుల బీర్లు, 15,500 కేసుల లిక్కర్ విక్రయాలు జరిగాయి. తద్వారా దాదాపు రూ 11.02 కోట్ల మద్యాన్ని మందుబాబులు కొనుగోలు చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇక, న్యూ ఇయర్ వేడుకలు జోష్‌గానే సాగాయి. డిసెంబరు 31న ఉదయం నుంచే మందుపార్టీలు చేసుకున్నారు. వీరిలో 20 నుంచి 50 ఏళ్ల వయసున్న వారు ఎక్కువగా ఉన్నట్లు అంచనా. ముఖ్యంగా బార్ల కంటే మద్యం దుకాణాల్లోనే విక్రయాలు ఎక్కువగా జరిగాయని తెలిసింది. 31వ తేదీన 9200 కేస్‌ల బీర్లు, 10,400 కేస్‌ల లిక్కర్ విక్రయాలు జరిగాయి. తద్వారా రూ.13.10 కోట్ల లావాదేవీలు జరిగాయి. 30వ తేదీతో పోలిస్తే 31న లిక్కర్ అమ్మకాలు తక్కువ. ఆ రోజు దుకాణాల వద్ద రద్దీ.. కొరత ఉండొచ్చన్న భావనతో ముందురోజే లిక్కర్‌ను మందుబాబులు తీసిపెట్టుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. కాగా, 2023 డిసెంబరు నెలాఖరులో జరిగిన విక్రయాలతో పోలిస్తే ఈ ఏడాది దాదాపు 67 శాతం పెరిగినట్లు అంచనా. ఇక, జనవరి 1న ఉదయం 10 నుంచి రాత్రి ఏడు గంటల వరకు.. రూ.9.32 కోట్ల మద్యం విక్రయాలు జరిగినట్లు తెలిసింది. ఇలా మూడు రోజుల్లో రూ.33.44 కోట్ల మద్యాన్ని మందుబాబులు తాగారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

డ్రంకెన్ డ్రైవ్ కేసులు 250

కొత్త సంవత్సరమని ఫుల్‌గా మందేశారు. మద్యం మత్తులో రోడ్డుపైకి వాహనాలు నడుపుతూ వచ్చారు. ఇలా మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు జిల్లాలో మందుబాబులు హల్‌చల్ చేశారు. బ్రీత్ అనలైజర్ ద్వారా పోలీసులు చేపట్టిన తనిఖీల్లో 250 మంది పట్టుబడ్డారు. వీరిపై కేసులు నమోదయ్యాయి. మిగతా వాళ్లు పోలీసులను చూసి పక్క వీధులగుండా.. లేదా వెనక్కి వెళ్లిపోయి తప్పించుకున్నారు. రాత్రి 10 నుంచి తెల్లవారుజామున 2 గంటల వరకు ఎస్పీ సుబ్బరాయుడు జిల్లాలోని పలు ప్రాంతాల్లో తిరగడంతో అధికారులు, సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉన్నారు. దీంతో ఎక్కడా మందుబాబుల ఆగడాలు.. రోడ్డు ప్రమాదాలు జరగకుండా కట్టడి చేయగలిగారు. తిరుపతి నగరంతో పాటు రూరల్, చంద్రగిరి, శ్రీకాళహస్తి, నాయుడుపేట, సూళ్లూరుపేట, సత్యవేడు తదితర ప్రాంతాల్లో మంగళవారం రాత్రి 9 గంటల నుంచి రిజర్వ్, శాంతి భద్రతలు, ఎస్టీఎఫ్, ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. కాగా, పట్టుబడిన 250 మందిలో 20 నుంచి 35 సంవత్సరాల వారు 90 మంది వరకు ఉన్నట్లు అంచనా. దాదాపు 180 మంది వరకు ద్విచక్రవాహనదారులే ఉన్నారు. 6 కార్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మందుబాబుల తనిఖీల్లో అత్యధికంగా బ్లడ్ ఆల్కహాల్ కౌంట్ 339 వరకు వచ్చినట్లు సమాచారం.



తిరుపతిలో మంగళవారం రాత్రి తనిఖీలు





బులుగు పోయె.. పసుపు వచ్చె..

ధాం.. ధాం.. ధాం!

వైసీపీ అధికారంలో ఉన్నపుడు ప్రభుత్వ భవనాలకీ, ప్రభుత్వం కట్టించిన పేదల ఇళ్లకీ, ఆఖరికి చెట్లకీ, కరెంటు స్తంభాలకు కూడా పార్టీ రంగులేసి నవ్వుల పాలయ్యారు. ప్రభుత్వ సొమ్ముతో పార్టీ సోకులా అని విమర్శలు వచ్చినా పట్టించుకోలేదు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం కూడా జగన్ బాటలోనే నడుస్తున్నట్లు ఉంది. దామినేడులోని ఇందిరమ్మ ఇళ్ల రిపేరు పనులు చేస్తూ పనిలోపనిగా పసుపు రంగు వేస్తున్నారు. అధికారుల అత్యుత్సాహమో.. నాయకుల ఆదేశమోగానీ దారిన పోయేవారు ఈ రంగు చూసి.. 'అప్పుడు వారూ.. ఇప్పుడు వీరూ.. సేమ్ టు సేమ్' అనుకుంటున్నారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

అన్నప్రసాద భవనంలో మరో కియోస్క్

తిరుమల, జనవరి1(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని వెంగమాంబ అన్నప్రసాద భవనంలో విరాళాల సమర్పణ కోసం టీటీడీ బుధవారం మరో కియోస్క్‌ను ప్రారంభించింది. అన్నప్రసాదం ట్రస్టుకు సులభతరంగా విరాళాలు అందించేందుకు ఇప్పటికే సౌత్ ఇండియన్ బ్యాంక్ అందజేసిన కియాస్క్‌ను టీటీడీ డిసెంబరు నెలలో ప్రారంభించింది. తాజాగా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విరాళంగా ఇచ్చిన మరో కియోస్క్‌ను బుధవారం టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ప్రారంభించారు. ఈ మిషన్ల ద్వారా భక్తులు ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు తక్కువ మొత్తాన్ని (రూ.1 నుంచి రూ.99 వేల వరకు) కూడా విరాళంగా అందజేయవచ్చు. కియాస్క్‌లోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి యూపీఐ ద్వారా విరాళాలు టీటీడీ ఖాతాలో జమచేయవచ్చు.

కొత్త శానంబట్లలో జల్లికట్టు





చంద్రగిరి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం కొత్త శానంబట్లలో బుధవారం పశువుల పండుగ(జల్లికట్టు) నిర్వహించారు. పరిసరాల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పశువులను తీసుకొచ్చారు. వీటికి కొమ్ములు చెలిగి, రంగులు వేసి కొప్పులను తొడిగారు. నాయకులు, సినీనటులు, దేవుళ్ల ఫొటోలతో అలంకరించారు. రంగు కాగితాలు అంటించిన చెక్క పలకలతో పాటు, నగదు, దుస్తుల, విలువైన వస్తు సామగ్రిని కట్టారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో గ్రామ నడివీధిలో పశువులను గుంపులుగా వదిలారు. వేలాది మంది యువకులు అల్లె అవతల నిలబడ్డారు. కోడెగిత్తలను నిలువరించేందుకు పోటీపడ్డారు. చెక్కపలకలను చేజిక్కించుకోవడంలో యువకుల మధ్య కొంత ఘర్షణ వాతావరణం నెలకొంది. కొందరు కింద పడటంతో పదిమందికి పైగా తీవ్రంగాను.. మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. చెక్క పలకలను చేజిక్కించుకున్న యువకులు ఉత్సహంగా కేరింతలు కొట్టారు. పశువుల పండగను తిలకించడానికి వచ్చిన వారందరికీ గ్రామస్తులు భోజనం, తాగునీటి సౌకర్యం కల్పించారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృతనిశ్చయంతో పనిచేస్తున్నాను. ఈక్రమంలో ఈ ఏడాది నిర్దేశించుకున్న ప్రాధాన్యతలు ఇవి.

-చంద్రగిరి(ఆంధ్రజ్యోతి)

గ్రామీణ రహదారుల రూపురేఖలు మారుస్తా

2025లో నా ప్రాధాన్యాలు : ఎమ్మెల్యే పులివర్తి నాని



1 పల్లెల్లో రోడ్ల పరిస్థితి మెరుగుపరుస్తా

గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల సమస్య గుర్తించాను.. ఇప్పటికీ 39 గ్రామాల్లో రోడ్లే లేని పరిస్థితి ఉంది. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపడుతున్నాం. సీసీ రోడ్లు వేస్తున్నాం. ఏఏ గ్రామాలకు రోడ్లు వేయాలనే దానిపై స్పష్టత ఉంది. కొన్ని ప్రతిపాదనల దశలో ఉన్నాయి. ఈమధ్య ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వచ్చినప్పుడు ఆయన దృష్టిలో పెట్టాను. ఆయన సానుకూలంగా స్పందించారు. ఆయన స్వగ్రామం నారావారిపల్లె ఇదే నియోజకవర్గంలో ఉండటం కలిసొస్తున్న అంశం.

2 నిరుద్యోగ యువతకు ఉపాధి

నియోజకవర్గంలో సుమారు ఏడు వేల మంది నిరుద్యోగ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. ఉద్యోగాలకు స్కిల్ అవసరమని గుర్తించాను. ముందుగా స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణ ఇచ్చేందుకు శ్రీకారం చుడుతున్నాం. చొరవ తీసుకుని వివిధ సంస్థలతో మాట్లాడుతున్నాను. విస్తృతంగా జాబ్ మేళాలు నిర్వహించాలని ప్రయత్నాలు ప్రారంభించాం. ఈక్రమంలోనే ఈనెల 3వ తేదీన నారావారిపల్లెలో జాబ్‌మేళాలో 1200 మందికి ఉద్యోగవకాశాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈఏడాదిలో ఎక్కువ జాబ్‌మేళాలు నిర్వహిస్తాం.

3 చెరువులకు జలకళ

వర్షం కురుస్తున్నా ఆరు మండలాల్లో చాలా చెరువులు నిండటంలేదు. కాలువలకు మరమ్మతులు చేపట్టాల్సిన అవవసరముంది. స్వర్ణముఖి నది నీటిని చంద్రగిరి మండలంలోని చెరువులకు మళ్లించేందుకు కృషి చేస్తున్నాను. తలకొన నీటిని వృథాగా పోనీయకుండా ఎర్రావారిపాలెం మండలంతో పాటు మరికొన్ని ప్రాంతాల చెరువులు నింపాలనే ప్రతిపాదనపై కసరత్తు చేస్తున్నాం. అధికారులు ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. చెరువులు నిండితే సాగు, తాగునీటి సమస్య ఉండదు. 2025లో ఈదిశగా ఎక్కువ పురోగతి సాధించాలనుకుంటున్నాం.

ఎమ్మెల్యే పులివర్తి నానికి శుభాకాంక్షల వెల్లువ



ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

తిరుచానూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు సమీపంలోని రఘునాథ్ రిసార్ట్సులో టీడీపీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే పులివర్తి నానిని పలువురు టీడీపీ నేతలు, వివిధ శాఖల అధికారులు,పోలీసులు కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు సురేంద్రబాబు, కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే పులివర్తి నాని మర్యాదపూర్వకంగా కలిశారు. దుశ్శాలువాతో సత్కరించారు. ఎస్పీ సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌ను ఎమ్మెల్యే కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నాని దంపతులకు సత్కారం

చంద్రగిరి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పులివర్తి నాని దంపతులను టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. అంతకుముందు ఎమ్మెల్యే రఘునాథ రిసార్ట్సులోని టీడీపీ కార్యాలయాన్నిప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పూలమాలలు, శాలువాలు, పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే దంపతులను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ రూరల్ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, అమిలినేని మధు, చేకూరు జనార్దన్‌చౌదరి, శ్రీధర్‌నాయుడు, చెరుకూరి మధుశేఖర్, తిరుమలరెడ్డి, సుబ్రమణ్యంనాయుడు, నంగా పద్మజారెడ్డి, నంగాబాబురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో పనిచేస్తే భగవంతుని అనుగ్రహం



పాదపూజలో పాల్గొన్న భగవాన్ రామదూత స్వామి

తిరుచానూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): తిరు చానూరులో బుధవారం వేణు దత్తాత్రేయస్వామి పాదపూజ మహోత్సవం జరిగింది. కార్యక్రమంలో భగవాన్ రామదూత స్వామి పాల్గొని భక్తులకు గురుమంత్రోపదేశం చేశారు. భక్తులకు అను గ్రహణబాషణంచేశారు. చేసే ప్రతిపనిలో ఏకాగ్రత ఉంటే భగవంతుని అనుగ్రహం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రామచంద్రారెడ్డి, వివిధరాష్ట్రాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



సంతానం- శ్రీజేత్-గాంధీ

తిరుమల, జనవరి1(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. నటుడు శ్రీతేజ్, తమిళనటుడు సంతానం, ఎమ్మెల్యేలు ఆరణి, సురేంద్రబాబు, టీడీపీ నేత నరసింహాయాదవ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దంపతులు, తమిళనాడు మంత్రి గాంధీ ఉన్నారు.

సైకం జయచంద్రారెడ్డికి అభినందన



శుభాకాంక్షలు తెలుపుతున్న కూటమి నాయకులు

తిరుపతి రూరల్, జనవరి1 (ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లైస్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ ఛైర్మన్ సైకం జయచంద్రారెడ్డిని బుధవారం రూరల్ మండలం గాంధీపురం పంచాయతీకి చెందిన పలువురు కూటమి పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. దుశ్శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ధనంజయరాయల్,శ్రీనివాసులు, కృష్ణయ్య, సాగర్ పాల్గొన్నారు

జనసైనికులకు అండగా ఉంటా : ఆరణి



సంబరాలు చేసుకుంటున్న ఆరణి, జనసేన నేతలు

తిరుపతి అర్బన్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసుల ఆధ్వర్యంలో నూతన ఆంగ్ల సంవత్సరాది వేడుకలు బుధవారం ఉదయం ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. జన సైనికుల మధ్య కేక్ కట్ చేసి, సంబరాలు చేసుకున్నారు. నాయకులు, కార్యకర్తలు ఆయనకు శాలువ కప్పి ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. సంబరాల్లో జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, వెంకటేశ్వర్లు, హరిశంకర్, మునస్వామి, ఆకేపాటి సుభాషిణి, మధులత, దుర్గ, రాధా తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై శ్రీవారి కృప ఉండాలని కోరుకున్నా..

నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకుని శ్రీవారు, గంగమ్మతల్లి ఆశీస్సులు నగర ప్రజలపై ఉండాలని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎమ్మెల్యేకు కూటమి, వివిధ సంఘాల నేతలు సన్మానాలు చేసి, శుభాకాంక్షలు తెలిపారు. తాతయ్యగుంట గంగమ్మ ఆలయ పూజారులు ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందించారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ



తిరుపతి(ఆర్టీసీ), జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ తిరుపతి రీజియన్ ఆధ్వర్యంలో ముద్రించిన డైరీని డీపీటీవో జగదీష్ బుధవారం సాయంత్రం ఆవిష్కరించారు. జిల్లా ప్రజారవాణాధికారి కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎంఈ నరసింహులు, సీటీఎం విశ్వనాథం, తిరుపతి, అలిపిరి డిపో మేనేజర్లు బాలాజీ, హరిబాబు, పీవో సహజాద్, ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్ జె.ఎం.ఆర్.నాయుడు, గౌరవాధ్యక్షుడు ఎ.చంద్రయ్య, రీజియన్ అధ్యక్షుడు శేషాద్రి, కార్యదర్శి ఆర్.సహదేవరాజు, కోశాధికారి రమేష్‌బాబు, కె.ఎస్.వాసులు, వి.సి.ఆచారి, ఎస్.ఎస్.మణ్యం, ఎ.మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

సంస్కృత వర్సిటీ దూరవిద్యా కేంద్రం డైరెక్టర్‌గా రంగనాథన్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత యూనివర్సిటీ దూరవిద్యా విభాగ డైరెక్టర్‌గా ఆచార్య చక్రవర్తి రంగనాథన్ నియమితులయ్యారు. వర్సిటీ సాహిత్య విభాగానికి చెందిన సీనియర్ ప్రొఫెసర్ రంగనాథన్ మూడేళ్ల పాటు ఈ స్థానంలో కొనసాగనున్నారు. సంస్కృత వర్సిటీలోనే విద్యాభ్యాసం చేసిన ఆయన ధనుర్మాస సమయంలో తిరుప్పావై ప్రవచనం చేయడంలో గుర్తింపు పొందారు. తెలుగు, సంస్కృతం, ఆంగ్లం, హిందీ, తమిళం, కన్నడ భాషల్లో ప్రావీణ్యం ఉంది. గతంలోనే దూరవిద్యా విభాగ డైరెక్టర్‌గా పనిచేశారు. మరోసారి ఆయనకు అవకాశం కల్పిస్తూ వీసీ ఆచార్య జీఎస్ఆర్ కృష్ణమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. రంగనాథన్‌ను ఆచార్య దక్షిణామూర్తిశర్మ తదితరులు అభినందించారు.

అమ్మవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



ఆలయం వద్ద జస్టిస్ కిరణ్మయి

తిరుచానూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కిరణ్మయి మండవ బుధవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దర్శనానంతరం జస్టిస్ కిరణ్మయిని ఆలయ అర్చకులు అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, వీఐ బ్రహ్మానందరాజు, ఏఈవో దేవరాజులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వర స్వామి సన్నిధిలో మాజీ మంత్రి



ఎర్రావారిపాలెం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆంగ్ల నూతన సంవత్సరాది సందర్భంగా బుధవారం తలకోన సిద్ధేశ్వర స్వామిని మాజీమంత్రి పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి, నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డిలు దర్శించుకొన్నారు. అభిషేకం,అర్చనసేవల్లో వీరు పాల్గొన్నారు. నాయకులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.


ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

తిరుపతి రూరల్, జనవరి1(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) జిల్లాశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన కొత్త సంవత్సర డైరీ, క్యాలెండర్‌ని ఎమ్మెల్యే పులివర్తినానీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘ జిల్లాఅధ్యక్షుడు బి.మురళీకృష్ణ, గౌరవ సలహాదారు ఎస్.వెంకటముని, కార్యదర్శి బి.బాలసుబ్రమణ్యం, రాష్ట్రకమిటీసభ్యులు వెంకటాద్రి, గోపాల్, చెంచురాజు, మునస్వామి, దాము, అక్తర్ అలీఖాన్ పాల్గొన్నారు.

పద్మావతీ వర్సిటీలో 57 ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నల్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పద్మావతీ మహిళా యూనివర్సిటీలోని పలు విభాగాల్లో 57 పరిశోధనా ప్రాజెక్టుల నిర్వహణకు అధికారులు పచ్చజెండా ఊపారు. మద్రాసు, ఎస్వీయూ, వైవీయూ, వీఎస్‌యూ అధ్యాపకులతో కలిసి ప్రాజెక్టులు నిర్వహిస్తారు. పద్మావతీ వర్సిటీ నిర్వహిస్తున్న జ్ఞానవి, గమనం పత్రికల ప్రతులను వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని ఆవిష్కరించారు. పీఎం ఉష పథకం కింద వీటిని నిర్వహిస్తున్నారు. రీసెర్చ్ ఆర్టికల్స్‌ను ప్రచురించనున్నారు. ప్రొఫెసర్ బీఎస్ నీలిమ సంపాదకురాలిగా వ్యవహరించనున్నారు.

తిరుమలలో మరో బంగారు బాబు



తిరుమల శ్రీవారి దర్శనానికి బుధవారం మరో బంగారుబాబు వచ్చారు. కర్ణాటకకు చెందిన రవి ఐదు కేజీల బంగారు ఆభరణాలను ధరించి శ్రీవారిని దర్శించుకున్నారు. తెలంగాణకు చెందిన కొండ విజయ్‌కుమార్ కూడా ఈరోజు మళ్లీ స్వామి దర్శనం చేసుకున్నారు. మెడలో భారీ బంగారు హారాలతో వచ్చిన వీరిని భక్తులు ఆసక్తిగా చూశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

మేజర్ పంచాయతీకి 'చెత్త' కష్టాలు

● కాగితాలకే డంపింగ్‌యార్డు పరిమితం ● వ్యర్థాలతో స్వర్ణముఖి దుర్గంధం ● స్థల కేటాయింపులో రెవెన్యూ తొండాట



స్వర్ణముఖి వద్ద డంపింగ్ చేసిన చెత్త



ఎక్కడ పడితే అక్కడ చెత్త ఇలా..

తిరుచానూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మేజర్ పంచాయతీ తిరుచానూరును చెత్త కష్టాలు వెంటాడుతున్నాయి. ఈ పంచాయతీ నుంచి ఏటా రూ.5కోట్లకు పైగా రాబడి వస్తోంది. పదివేల గడపలు, 20 వార్డులు ఉన్నాయి. శ్రీవారి దేవేరి పద్మావతి అమ్మవారి ఆలయం కూడా తిరుచానూరులోనే ఉంది. ప్రాముఖ్యత ఈ గ్రామ పంచాయతీకి డంపింగ్ యార్డు లేదు. సుమారు 30వేలు జనాభా కలిగిన ఈ పంచాయతీ పరిధిలో టన్నుల కొద్దీ వ్యర్థాలు సేకరిస్తారు. కొంతమంది చెత్త వ్యర్థాలను స్వర్ణముఖి నదీ ప్రాంతంలో వేస్తుండటంతో ప రిసరాలు దుర్గంధం వె దజల్లుతున్నాయి. అమ్మ వారి ఆలయం వద్ద కొంత మంది వ్యాపారులు, ఓ పాఠశాల యాజమాన్యం, కొంతమంది కల్యాణ మండపాల డెకరేషన్‌దారులూ స్వర్ణముఖిలోనే చెత్తను వేస్తున్నారు.

పట్టని రెవెన్యూ అధికారులు

గతంలో తిరుచానూరు పాలకమండలి, స్థానికుల అభ్యర్థన మేరకు అప్పటి కలెక్టర్లు సమస్యను పరిష్కరించాలని రెవెన్యూ, పంచాయతీ అధికారులను ఆదేశించారు. స్వర్ణముఖి తీర ప్రాంతంలో రెండెకరాలు డంపింగ్‌యార్డుకు కేటాయించాలని జిల్లా అధికారులు ఆదేశించినా రెవెన్యూ అధికారులు మాత్రం స్థలం లేదంటూ తొండాట ఆడుతున్నారు. గత్యంతరం లేక వ్యర్థాలను స్వర్ణముఖి తీరంలోనే డంపింగ్ చేస్తున్నారు. కానీ పాక్షికంగా చెత్త నిల్వలను మరో డంపింగ్ యార్డుకు తరలిస్తున్నట్లు పంచాయతీ అధికారులు చెబుతున్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్ స్పందించి స్థలం కేటాయించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

స్వర్ణముఖిలో చెత్త వేస్తే చర్యలు

డంపింగ్‌యార్డు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళతాం. స్వర్ణముఖిలో చెత్త వ్యర్థాలు వేస్తున్నారనే అంశం నా దృష్టికి వచ్చింది. అలా వేయడం నేరం. అక్కడ చెత్త డంపింగ్ చేయకుండా గట్టి చర్యలు తీసుకుంటాం.

రామచంద్ర, తిరుపతి రూరల్ ఎంపీడీవో

న్యూఇయర్ వేళ భక్తులతో ఆలయాలు కిటకిట



కల్యాణ వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ

చంద్రగిరి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర ఆగమనం సందర్భంగా శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని టీటీడీ, చంద్రగిరి పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. చంద్రగిరిలోని మూలస్థాన ఎల్లమ్మ, కోదండరామాలయం, మల్లేశ్వరస్వామి ఆలయం, తొండవాడ అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో భక్తుల కోలాహలం కనిపించింది. **పాకాల:** నూతన సంవత్సర ఆగమనం సందర్భంగా బుధవారం తెల్లవారుజాము నుంచి నేంద్రగుంట వేంకటేశ్వరస్వామి,శంఖంపల్లె ఆంజినేస్వామి,నూరినేనిపల్లె శివాలయం, ఊట్లవారిపల్లె ఆనందగిరి వళ్లీ దేవసేన సమేత కళ్యాణ సుబ్రమణ్యస్వామి, అనంతరాయల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మంగళవారం రాత్రి, బుధవారం ఉదయం రోమన్ క్యాథలిక్ మిషన్ చర్చ్, సెయింట్ పాల్స్ సీఎస్ఐ చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. **భాకరాపేట:** దేవరకొండలోని వేం కటేశ్వరస్వామి, రం గన్నగారిగడ్డలోని కొల్లాపురమ్మ, చిట్టేచెర్లలోని అభయ వేంకటేశ్వర స్వామి, భాకరాపేటలోని ముత్యాలమ్మ తదితర ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక అభిషేకాలు చేశారు. కొల్లాపురమ్మ ఆలయంలో దివంగత జడ్పీ మాజీ ఛైర్మన్ సిద్దరామిరెడ్డి కుటుంబసభ్యులు అన్నదానం నిర్వహించారు.

బీఎస్ఎన్ఎల్ 4జీ సేవల కోసం నిరీక్షణ

అదిగో ఇదిగో అంటున్న అధికారులు

తిరుపతి(ఆటోనగర్) జనవరి1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు 4జీ సేవలు నానాటికీ దూరమవుతున్నాయి. గతేడాది జూన్‌లోపు ఈ సేవలు అందుబాటులోకి వస్తాయని అధికారులు ప్రకటించారు. ఇప్పటి వరకు సేవలు అందలేదు. మరోపక్క నెట్‌వర్క్ అందక వినియోగదారులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో విదేశీ పరిజ్ఞానంతో ఉన్న 4జీ సేవలను తొలగించి స్వదేశీయ పరిజ్ఞానంతో (మేకిన్ ఇండియా) సేవలందించే ప్రయత్నం నేటికీ సఫలం కాలేదు. ఈక్రమంలో 4జీ పరికరాలు గత ఏప్రిల్‌కే తిరుపతికి చేరుకున్నాయి. మూడు నెలల్లో జిల్లా వ్యాప్తంగా 604 టవర్ల ద్వారా 4జీ సేవలు అందిచడానికి చర్యలు తీసుకుంటామని అధికారులు ప్రకటించారు. గడువు ముగిసి చాన్నాళ్లవుతున్నా 4జీ సేవలు సంపూర్ణంగా అందడలేదని వినియోగదారులు వాపోతున్నారు. ● ప్రైవేటు కంపెనీలు చరవాణీ ప్యాకేజీలను పెంచడం, బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు అందుబాటులోకి తెస్తామని అధికారులు ప్రకటించిన నేపథ్యంలో చాలా మంది బీఎస్ఎన్ఎల్ కనెక్షన్లు తీసుకున్నారు. వీరంతా నెట్‌వర్క్ అందక తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. తిరుపతి, రేణిగుంట టౌన్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో నెట్‌వర్క్ సక్రమంగా అందడం లేదంటున్నారు. కాగా మరో మూడు నెలల్లో 604 టవర్ల ద్వారా 4జీ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నామని జిల్లా ప్రిన్స్‌ఫల్ జనరల్ మేనేజరు సి.అమరేంద్ర రెడ్డి తెలిపారు.

గజలక్ష్మి నమోస్తుతే



గజవాహనంపై పద్మావతి అమ్మవారు

తిరుచానూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారు గజవాహనంపై కొలువుదీరి మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. జన్మనక్షత్రం ఉత్తరాషాడను పురస్కరించుకుని బుధవారం వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొపి అర్చకులు నిత్య కైంకార్యాలు చేశారు. మధ్యాహ్నం నేత్రపర్వంగా అభిషేకం నిర్వహించారు. రాత్రి తిరుమాడ వీధుల్లో గజవాహన సేవ వేడుకగా జరిగింది. కొత్త సంవత్సరం సందర్భంగా అమ్మవారి దర్శనార్థం భక్తులు పోటెత్తారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏవీఎస్వో సతీష్‌కుమార్, సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు బాబుస్వామి, మణికంఠస్వామి, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

మూడు వాహనాల ఢీ: తప్పిన ప్రమాదం

రేణిగుంట, జనవరి 1(ఆంధ్రజ్యోతి) : గొర్రెల మంద రోడ్డుకు అడ్డుగా రావడంతో వాహనం బ్రేక్ వేయడంతో ఒకదాని వెనుక ఒకటి ఇలా మూడు వాహనాలు ఢీకొన్నాయి. కేఎల్ఎం ఆస్పత్రి కూడలిలో ఈ ప్రమాదం జరిగింది. ఈ కూడలి వద్ద గొర్రెల మంద రోడ్డు దాటుతోంది. అటువైపుగా వస్తున్న లారీ డ్రైవర్ మందను చూసి బ్రేక్ వేశాడు. వెనుకే వస్తున్న కారు ముందున్న లారీని ఢీకొట్టింది. ఆ వెనుకే వస్తున్న బస్సు కారును ఢీకొనింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతిన్నా ప్రయాణికులు గాయపడ లేదు. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. అయితే ఘటనతో ఈ మార్గంలో రాక పోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీరించారు.

అదుపు తప్పి పాల వ్యాన్ బోల్తా



కేవీబీపురం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని సదాశివపురం వద్ద బుధవారం తెల్లవారు జామున నెల్లూరు నుంచి పిచ్చా టూరుకు వెళ్తున్న పాల వ్యాన్ అదుపు తప్పి పొలాల్లో బోల్తా పడింది. స్వల్పగాయాలతో డ్రైవర్ బయటపడ్డాడు. వ్యాన్ ఖాళీగా ఉండ టంతో ఎలాంటి నష్టం జరగలేదు. సదాశివపురం చెరువు గట్టు మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ పెద్దసూచిక బోర్డులను ఏర్పాటు చేస్తే కొంత వరకు ప్రమాదాలను నివారించవచ్చు.

గ్రామ పెద్దలకు సన్మానం

చంద్రగిరి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నాగాలమ్మ ఆలయం అభివృద్ధికి సహకరించిన దాతలను, గ్రామ పెద్దలను నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం ఆలయ ధర్మకర్త ఒంటి శివశంకర్‌రెడ్డి దంపతులు సన్మానించారు. ఆలయ స్థలదాత విజయసాయిరెడ్డి, సునందారెడ్డిల పేరిట ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో అర్చకులు శివరామ్‌శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంస్కృత వర్సిటీ పాలకమండలి సభ్యుడిగా విష్ణుభట్టాచార్యులు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యుడిగా ఆగమ విభాగాధిపతి ఆచార్య వేదాంతం విష్ణుభట్టాచార్యులు నియమితులయ్యారు. ఇప్పటివరకు పాలకమండలి సభ్యురాలిగా వ్యవహరించిన ప్రొఫెసర్ లలితారాణి పదవీకాలం ముగియడంతో ఆ స్థానంలో ఆయన్ను నియమిస్తూ వీసీ కృష్ణమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. విష్ణుభట్టాచార్యులు 1997లో విద్యాపీఠంలో అధ్యాపకుడిగా చేరారు.ఆగమ విభాగాధిపతిగా, దర్శన సంకాయ డీన్‌గా పనిచేశారు. టీటీడీ వైఖానస ఆగమ సలహాదారుగా సేవలందించారు. 25కు పైగా పుస్తకాలు రాశారు. 15 పీహెచ్‌డీలకు పర్యవేక్షకులుగా వ్యవహరించారు.

చురుగ్గా టీటీడీ నిర్మాణ పనులు

● శ్రీనివాసానికి నూతన స్వాగత తోరణం

● రూ. 4.8కోట్లతో ఆర్చీలు, రోడ్డు, సబ్‌వే నిర్మాణం



పూర్తికావచ్చిన స్వాగత తోరణ నిర్మాణం



బస్టాండులోకి సబ్‌వే అనుసంధాన ఏర్పాట్లు

తిరుపతి అర్బన్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీనివాసం, మాధవం విశ్రాంతి భవన సముదాయాలకు రూ.4.8కోట్లతో చేపట్టిన స్వాగత తోరణాలు, రోడ్లు, సబ్‌వే నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. బస్టాండు నుంచి వచ్చే ఈ వసతి సముదాయాల యాత్రికుల కోసం ఇదివరకే సబ్‌వే రోడ్డు వరకే నిర్మించారు. దీంతో యాత్రికులు సబ్‌వే నుంచి వచ్చాక మళ్లీ రోడ్డుమీదకు నడిచి వసతి సముదాయాల ప్రధాన ప్రవేశ మార్గంలోకి వెళ్లేవారు. తిరిగి రోడ్డు మీద నడిచి బస్టాండుకు వెళ్లాల్సి వచ్చేది. గరుడవారధి ర్యాంపు వసతి సముదాయాల ప్రధాన గేటు ముందు వరకు విస్తరించడంతో వాహనాల తాకిడి అధికమైంది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈనేపథ్యంలో వసతి సముదాయాలకు దక్షిణంగా, బస్టాండుకు సమీపంలో మరో ప్రత్యామ్నాయ మార్గాలు, సబ్‌వే పొడిగిస్తూ నిర్మాణాలు చేపట్టేందుకు టీటీడీ రూ.4.8కోట్లు మంజూరుచేసింది. 8 నెలల క్రితం ప్రారంభమైన ఈ పనులు కొలిక్కి వచ్చాయి. వాహనాల రాకపోకలకు వేర్వేరు మార్గాలు, రెండు ప్రవేశాలతో ఆర్చీ, రోడ్డు అంచున నడకదారి నిర్మించారు. బస్టాండు నుంచి శ్రీనివాసంలోకి సబ్‌వేను పొడిగించారు. దీనివల్ల బస్టాండు నుంచి ట్రాఫిక్ సమస్య లేకుండా శ్రీనివాసంలోకి వెళ్లిపోవచ్చు. సబ్‌వేను, రోడ్లను ప్రారంభించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. స్వాగతం తోరణంలోని దేవతా ప్రతిమలు, గోపురాలు, వివిధ ఆకృతులు ఆధ్యాత్మిక శోభను తీసుకొచ్చాయి.

2025లో తిరుపతి అభివృద్ధికి నేను పెట్టుకున్న లక్ష్యంలో తొలి ప్రాధాన్యాలు ఇవీ... ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతిలో యూడీఎస్ ప్రక్షాళన

1

యూడీఎస్ పునరుద్ధరణ

తిరుపతిలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ (యూడీఎస్) ను ప్రక్షాళన చేయడం అత్యంత అవసరం. పాతికేళ్ల కిందట నిర్మించిన ఇది విస్తృతంగా పెరిగిన తిరుపతి అవసరాలకు ఏమాత్రం సరిపోవడం లేదు. యూడీఎస్ పునరుద్ధరణ కోసం రూ90కోట్లు కావాలి. నగరపాలక సంస్థ మీద మాత్రమే ఆధారపడలేం. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కేంద్ర నిధులు తీసుకురావాలన్నది నా ఆలోచన. 2025లోనే నిధులు మంజూరు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నాను.

2

సంక్రాంతి లోపు శెట్టిపల్లి సమస్య సెటిల్

దశాబ్దాలుగా నలుగుతున్న శెట్టిపల్లి భూ సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక చొరవ తీసుకుంటు న్నాం. కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్యలు ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నారు. సంక్రాంతి లోపు శెట్టిపల్లి భూబాధితులకు ప్రొసీడింగ్స్ ఇచ్చేలా చూస్తాం.

3

స్మార్ట్ ప్రాజెక్టులు పూర్తి

తిరుపతిలో స్మార్ట్ సిటీ ప్రాజెక్టు పనులు వేగవంతం చేస్తాం. మున్సిపల్ కార్పొరేషన్‌కు ఐకానిక్ భవనం 2025లోనే పూర్తికానుంది. మల్టీలెవల్ కార్‌పార్కింగ్, క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులు కూడా పూర్తి చేస్తాం.







జోరుగా.. హుషారుగా..!



అంబరాన్నంటిన నూతన సంవత్సర సంబరాలు

ఆలయాలు, బేకరీలు, హోటళ్లు, పార్కుల్లో రద్దీ

కాలేజీలు, యూనివర్సిటీల్లో యువత సందడి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. ముఖ్యంగా యువత నగరంలో సందడి చేసింది. ఆలయాల్లో ఉదయం నుంచే భక్తుల రద్దీ కన్పించింది. బేకరీల్లో కేకులు, బొకే షాపుల్లో బొకేలు, గిఫ్టు షాపులు, హోటళ్లు, పార్కులు జనంతో కిక్కిరిసిపోయాయి. కొన్ని హోటళ్లు, బేకరీలు కస్టమర్స్‌ను రాబట్టుకునేందుకు ఆఫర్లు ప్రకటించారు. వస్త్ర, నగలు, చికెన్, మటన్ షాపులు కూడా జనంతో కిక్కిరిసాయి. ప్రధాన రోడ్లపై బైకులు, కార్ల జోరు కన్పించింది. కాలేజీలు, యూనివర్సిటీల్లో విద్యార్థులు, ఉద్యోగులు, అధికారులు పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకుంటూ సందడి చేశారు. కొన్నిచోట్ల యువత డ్యాన్సులతో అదరగొట్టారు. ఆలయాల్లో రద్దీని దృష్టిలో ఉంచుకుని తగిన ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలకు చోటివ్వకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.





ప్రకాశం పార్కులో సందర్శకుల కోలాహలం - సాయిబాబా ఆలయంలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

స్విమ్స్‌లో అరుదైన శస్త్ర చికిత్స



తిరుపతి (వైద్యం), జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కడుపులో అవయవాలు పూర్తిగా చెడిపోయి స్విమ్స్‌కు వచ్చిన 32 ఏళ్ల వ్యక్తికి గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆధ్వర్యంలో అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. తీవ్ర కడుపునొప్పితో బాధపడుతూ వచ్చిన సదరు వ్యక్తికి వైద్య పరీక్షలు చేయగా కడుపులో పేగులు, చాతిలో పూర్తిగా ఇన్‌ఫెక్షన్ అయ్యి చీముతో నిండి కుళ్లి ఉండటాన్ని గుర్తించామని చెప్పారు. ఐసీడీ ట్యూబ్ ద్వారా రోగి చాతిలో చేరిన చీమును తొలగించడమేగాక అత్యంత క్లిష్టమైన శస్త్ర చికిత్సను విజయవంతంగా చేసి, రోగి ప్రాణాలు నిలబెట్టామని వివరించారు. వారం రోజుల తర్వాత రోగి పూర్తిగా కోలుకోవడంతో బుధవారం డిశ్చార్జి చేసినట్లు తెలిపారు. శస్త్ర చికిత్సలో వైద్యులు శివరామకృష్ణ, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నట్లు తెలిపారు.



ఆంగ్ల నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని అమరరాజా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్, మాజీ ఎంపీ గల్లా జయదేవ్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఏనుగు మునినాదం

కేబుల్ ఆపరేటర్లకు విద్యుత్ శాఖ నోటీసులు

తిరుపతి(ఆటోనగర్), జనవరి1 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర పరిధిలోని కేబుల్ ఆపరేటర్లకు నోటీసులు పంపినట్లు తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ ఈఈ వి.చంద్రశేఖరరావు తెలిపారు. కేబుల్ ఆపరేటర్లు విద్యుత్ సంస్థ నిబంధనలను అతిక్రమించి స్తంభాలపై కేబుల్స్ లాగుతున్నారని, తద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. తద్వారా సంస్థకు భారీగా ఆర్థిక నష్టం వాటిల్లుతోందన్నారు. ఇప్పటికే పలుమార్లు హెచ్చరించినా పట్టించుకోని కారణంగా నోటీసులు జారీ చేశామని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న కేబుల్స్‌ను 15 రోజుల్లోపు తొలగించిన పక్షంలో కట్ చేస్తామని స్పష్టం చేశారు. ఈ మధ్య కాలంలో విద్యుత్ ప్రమాదాలు జరిగితే అందుకు కేబుల్ ఆపరేటర్లు బాధ్యులవుతారని పేర్కొన్నారు.

వినాయకసాగర్ వాకర్స్ అసోసియేషన్‌కు అవార్డు



తిరుపతి(జీవకోన), జనవరి1(ఆంధ్రజ్యోతి): కరకంబాడీ రోడ్డులోని వినాయకసాగర్ వాకర్స్ అసోసియేషన్ కు ఉత్తమ అవార్డు లభించింది. బుధవారం వాకర్స్ ఇంటర్నేషనల్ రీజనల్ కౌన్సిలర్ ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ చేతుల మీదుగా అసోసియేషన్ నాయకులు అవార్డు స్వీకరించారు. 2024లో వినూత్న సేవా కార్యక్రమాలు చేసినందుకుగానూ ఈ అవార్డు అందజేసినట్లు ఆర్కాట్ కృష్ణప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు గోపిప్రసాద్, శివారెడ్డి, రామస్వామి, సాయికృష్ణంరాజు, వెంకటేశ్వరరాజు, నరసింహయ్య, సుబ్రహ్మణ్యంరాజు, శాంతి తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

తిరుపతి(వైద్యం), జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో బుధవారం రుయాస్పత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఎంపీ గురుమూర్తి ముఖ్య అతిథిగా హాజరై రోగులకు పండ్లు అందజేశారు. ఎంపీ మాట్లాడుతూ రోగులు కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రవిప్రభు, సీఎస్ఆర్ఎంవో సుబ్బలక్ష్మమ్మ, ఆర్ఎంవో శ్రీనివాస్, ఏఆర్ఎంవో హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

10నుంచి టెన్నిస్ డబుల్స్ టోర్నమెంట్

తిరుపతి(క్రీడలు), జనవరి 1 : స్థానిక టౌన్, ఆఫీసర్స్ క్లబ్‌ల క్రీడా ప్రాంగణాలలో ఈనెల 10వ తేదీ నుంచి మూడు రోజులు శనల నాగముని మెమోరియల్ టెన్నిస్ డబుల్స్ టోర్నమెంటు నిర్వహించనున్నట్లు క్రీడా భారతి అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డి.రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 40, 50, 60, 70 ప్లస్ ఏజ్ గ్రూపుల క్రీడాకారులు పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. విన్నర్స్, రన్నర్స్, గ్రూపు దశలో నిష్క్రమించిన క్రీడాకారులకు కూడా నగదు బహుమతి ప్రదానం చేయనున్నట్లు వివరించారు. మరిన్ని వివరాలకు 9491145556, 9440245980, 9441296125లను సంప్రదించాలని కోరారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 1 (ఆంధ్రజ్యోతి): వే ఫౌండేషన్ రూపొందించిన క్యాలెండర్లను తుడా కార్యదర్శి వెంకటనారాయణ బుధవారం ఆవిష్కరించారు. వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో పైడి అంకయ్య చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.

రుద్రకోటికి సన్మానం



తిరుపతి(జీవకోన), జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ఆంగ్ల నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని ఏపీ నాయీ బ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివాన్ని తిరుపతిలోని ఆలయ నివాసం వద్ద ఉద్యోగులు, నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. కేక్ కట్ చేసి, సంబరాలు చేసుకున్నారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలని, ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం నాయకులు మల్లికార్జున, శంకర్, అమర్, భజంత్రీ, యుగంధర్, విశ్వనాథ్, సుబ్బరామయ్య, రెడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

ప్రజలకు మెరుగైన సేవలందిద్దాం

● ఎమ్మెల్యే భానుప్రకాష్



ఎమ్మెల్యేకు నోటు పుస్తకాలు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ మంజు నాథ్ గౌడ్ - పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న సీఐ సురేంద్రనాయుడు తదితరులు

పుత్తూరు అర్బన్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరంలో ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు సంకల్పించాలని అధికారులకు ఎమ్మెల్యే భానుప్రకాష్ సూచించారు. బుధవారం ఆయనకు అధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పుత్తూరు మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌గౌడ్, ఇతర అధికారులు, స్థానిక నాయకులు పుష్పగుచ్ఛాల స్థానంలో నోటు పుస్తకాలను అందజేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం పట్ల ప్రజల్లో విశ్వాసం ఉందన్నారు. పుత్తూరు సీఐ సురేంద్రనాయుడుతో పాటు సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, నాయకులు శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో ఉన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి



విజయబాబుకు నాయకుల సన్మానం

పుత్తూరు అర్బన్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నగరి నియోజకవర్గంలో టీడీపీని భవిష్యత్తులో మరింత బలోపేతం చేస్తానని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు చెప్పా రు. బుధవారం స్థానిక ఎంబీ రోడ్ లోని కార్యాలయంలో విజయ్ బాబుకు పలువురు టీడీపీ నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. పరమేశ్వరమంగళం ఎంపీటీసీ సభ్యురాలు శ్రీజ బాలాజీనాయుడు గజమాలతో సత్కరించారు. రవి నాయుడు, దాసరి విజయ చౌదరి, కుమార్ రెడ్డి, శేఖర్ రెడ్డి, కుమార్ రెడ్డి, విజయ శేఖర్‌నాయుడు, సెంగునాథన్ తదితరులు శుభాకాంక్షలు తెలిపిన వారలో ఉన్నారు.

అప్పలాయగుంటకు పోటెత్తిన జనం



ప్రసన్న వెంకటేశ్వరాలయ క్యూలైన్‌లో ఉన్న భక్తులు

వడమాలపేట, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర సందర్భంగా అప్పలాయగుంటలో ప్రసన్న వెంకటేశ్వర స్వామి దర్శనార్థం పరిసర ప్రాంతాల నుంచి భక్తజనం పోటెత్తారు. బుధవారం వడమాలపేట, తిరుపతి, పుత్తూరు పరిసర ప్రాంతాల నుంచి విచ్చిన భక్తుల స్వామి వారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య పూజలు చేశారు.

పుత్తూరులో...



సాయిబాబా ఆలయంలో వేచి ఉన్న భక్తులు

పుత్తూరు టౌన్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కామాక్షి దేవి సమేత సదాశివేశ్వరస్వామి, సాయిబాబా ఆలయం, సుబ్రహ్మణ్య స్వామి ఆలయం, ఆరేటమ్మ ఆలయాల్లో భక్తులు ఉదయం నుంచి క్యూలైన్లలో వేచి ఉండి, స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు.

కోలా ఆనంద్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు



ఏర్పేడు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్‌ను బుధవారం ఏర్పేడు మండల అధ్యక్షుడు తిరుమలశెట్టి నరేష్ పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విజయ్‌రాయల్, హరిరాయల్, కిరణ్, సురేష్ తదితరులున్నారు.

రక్తదాతకు అభినందనలు



శ్రీకాళహస్తి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన నారాయణ గుండె చికిత్స నిమిత్తం తిరుపతిలోని ప్రైవేటు ఆస్పత్రిలో చేరాడు. అయితే అతనికి బి నెగిటివ్ రక్తం కావాల్సి రావడంతో కుటుంబ సభ్యులు బుధవారం యువతరం సేవా సమితిని సంప్రదించారు. స్పందించిన వారు బుచ్చినాయుడుకండ్రిగ మండలం కాటూరుకు చెందిన మురళికి ఫోన్ చేశారు. దీంతో మురళి వెంటనే తిరుపతికి చేరుకుని రక్తదానం చేశారు. కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రి రవీంద్రను కలిసిన త్యాగరాజు

వరదయ్యపాళెం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రమంత్రి కొల్లు రవీంద్రను బుధవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం వద్ద బీజేపీ నేత గుత్తి త్యాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి గురించి మంత్రితో చర్చించారు. అదే విధంగా రాష్ట్ర చేనేత సొసైటీల కార్పొరేషన్ ఛైర్మన్ డాక్టర్ సజ్జ హేమలతను కూడా కలిశారు. చేనేతల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

గొబ్బెమ్మల సందడి



కోట గిరిజన కాలనీలో గొబ్బెమ్మలు ఆడుతున్న చిన్నారులు

కోట, జనవరి 1: (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో సంక్రాంతి సంబరాలు మొదలయ్యాయి. సాయంత్రం పూట మహిళలు, యు వతులు గొబ్బెమ్మలు ఆడు తూ సందడి చేస్తున్నారు. ప్రధానంగా శ్రీలక్ష్మమ్మకాలనీ, కోటమ్మగుడి కాలనీ, గూడలి, చిట్టేడు గ్రామాల్లో గొబ్బెమ్మల సందడి మొదలైంది.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

గూడూరు అర్బన్, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపిరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో రోటరీక్లబ్, గూడూరు క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్ పాఠశాలల క్రికెట్ పోటీలు బుధవారం ఉత్సాహంగా జరిగాయి. మొదటి మ్యాచ్ నారాయణ - ప్రాస్పరో పాఠశాల మధ్య జరగగా ప్రాస్పరో పాఠశాల జట్టు, రెండో మ్యాచ్ ఆదిశంకర - శ్రీచైతన్య జట్లు మధ్య జరగగా శ్రీచైతన్య జట్టు, మూడో మ్యాచ్ విందూరు జడ్పీ - గూడూరు జడ్పీ మధ్య జరగగా గూడూరు జడ్పీ జట్టు, నాలుగో మ్యాచ్ సీఎస్ఎం - ఎల్‌ఏపీ మధ్య జరగగా ఎల్‌ఏపీ జట్లు విజయం సాధించాయి. ఈ మ్యాచ్‌లను మునిగిరీష్, లవకుమార్ పర్యవేక్షించారు.

2025లో నా ప్రాధాన్యాలు నెల్లూరు జిల్లాలో గూడూరు విలీనానికి కృషి

ఎమ్మెల్యే పాశిం



1 గూడూరును నెల్లూరు జిల్లాలో కలిపేందుకు కృషి

వైసీపీ ప్రభుత్వం జిల్లాల పునర్విభజన అసంబద్ధంగా చేయడంతో గూడూరు నియోజకవర్గం తిరుపతి జిల్లా పరిధిలోకి వచ్చింది. జిల్లా కేంద్రమైన తిరుపతి దూరంగా ఉండడంతో నియోజకవర్గ ప్రజలు, అధికారులు వ్యయ ప్రయాసలతో ఇబ్బందులు పడుతున్నారు. గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబు, యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. ఈ అంశాన్ని నేనే కూడా అసెంబ్లీలో ప్రస్తావించా. ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు కృషి చేస్తా.

2 పంబలేరు వాగుపై వంతెన పూర్తి చేస్తాం

2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో రూ.19 కోట్ల అంచనాతో పంబలేరు వంతెన పనులకు శంకుస్థాపన చేశా. గత వైసీపీ ప్రభుత్వంలో వంతెనను నిర్మించారు. కానీ అప్రోచ్ రోడ్డు లేకపోవడంతో అసంపూర్తిగా ఉంది. గూడూరు ప్రజల అభిలాష అయిన ఈ వంతెనను ఏడాదిలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటా. ఇందుకోసం రూ.8 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపడం జరిగింది.

3 అసంపూర్తిగా ఉన్న ఫ్లైఓవర్ పూర్తి చేయడం

గూడూరు ఒకటో, రెండో పట్టణానికి రాకపోకలు సాగించేందుకు వీలుగా నిర్మించిన ఫ్లైఓవర్ 13 ఏళ్లగా అసంపూర్తిగా ఉంది. కూటమి ప్రభుత్వం హయాంలో ఈ వంతెనను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తా.

స్వర్ణ కాంతుల్లో చెంగాళమ్మ



బంగారుచీర అలంకారంలో సూళ్లూరుపేట చెంగాళమ్మ



విశేష అలంకారంలో మన్నారుపోలూరులోని చెంగాళమ్మ

సూళ్లూరుపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): చెంగాళమ్మ పరమేశ్వరి ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా బుధవారం స్వర్ణశోభతో వెలుగొందారు. తెల్లవారు జామున అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అమ్మవారిని బంగారుచీరతో అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. స్థానికులతో పాటు తమిళనాడు నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ దంపతులు, టీడీపీ నేత, ప్రముఖ పారిశ్రామిక వేత్త కొండేపాటి గంగాప్రసాద్ దంపతులు, నాయకులు తిరుమూరు సుధాకర్ రెడ్డి, ఆకుతోట రమేష్, మాధవ నాయుడు, ఏజీ కిషోర్ అమ్మవారిని దర్శించుకున్నారు. దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల పుష్పాలతో అలంకరించారు. రంగవల్లులు, విద్యుత్ దీపకాంతులతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.





గూడూరులోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో బారులు తీరిన భక్తులు - నాయుడుపేటలోని పోలేరమ్మ ఆలయంలో భక్తుల పూజలు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

గూడూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు ఆలయాల్లో బుధవారం నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం, సాయిబాబాగుడి, కోదండ రామాంజనేయస్వామి ఆలయం, చెన్నకేశవస్వామి ఆలయం, బాలాజీ నగర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పట్టణంలోని ఎస్ఏల్‌సీ చర్చి, ప్రార్థనా మందిరం, హోసన్నమందిరం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే మండలంలోని కుందకూరు సమీపంలో గల కనుమరాయికొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం నూతన సంవత్సరం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

కోట(ఆంధ్రజ్యోతి): కోట మండలం గూడలిలో గల కామాక్షీదేవి సమేత సంఘమేశ్వర ఆలయం, పర్వతవర్ధిని సమేత భీమేశ్వరాలయం, జనార్దనస్వామి ఆలయం, కోటమ్మ ఆలయం, విద్యానగర్‌లోని బాబా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా విద్యానగర్, కోట పట్టణంలోని చర్చిల్లో ప్రార్థనలు జరిగాయి.

నాయుడుపేట టౌన్(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నాయుడుపేట(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని బుధవారం భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. నాయుడుపేట పిచ్చిరెడ్డితోపులోని విజయగణపతి దేవస్థానం స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు.

తడ(ఆంధ్రజ్యోతి): స్థానిక భువనేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారు జామునే పాలాభిషేకం, రుద్రాభిషేకం చేశారు. శివలింగాన్ని వెన్నతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే షిరిడీసాయి బాబా ఆలయం, చల్లాటమ్మ ఆలయం, సీతారామ ఆంజనేయస్వామి ఆలయం, చిన్నమాంబట్టు కాశీవిశ్వేశ్వర ఆలయం, పన్నంగాడు వద్ద ఉన్న ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

చిల్లకూరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరులో వెలసిన ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల దర్శనార్థం అమ్మవారిని బంగారుచీరతో అలంకరించారు. భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం నివేదించారు. బంగారు చీర అలంకారంలో ఉన్న ముత్యాలమ్మను దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. అదేవిధంగా మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామికి విశేష పూజలు జరిపారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అలాగే మండలంలోని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.







కోట: ప్రత్యేక అలంకారంలో కోటమ్మ - చిల్లకూరు: బంగారుచీరలో ముత్యాలమ్మ - తడ: వెన్న అలంకారంలో మహాశివలింగం

కల్యాణ్‌రెడ్డికి సత్కారం



కల్యాణ్‌రెడ్డిని సత్కరిస్తున్న యువకులు

పెళ్లకూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలం శిరసనంబేడు గ్రామంలో కేఆర్ చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ వేలూరు కల్యాణ్‌రెడ్డి స్వగృహంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. కల్యాణ్‌రెడ్డిని గ్రామానికి చెందిన యువకులు సత్కరించారు. కార్యక్రమంలో కుంపటి సిసింద్రీ, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

కోట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణం నార్త్ గిరిజన కాలనీ, శ్రీలక్ష్మమ్మ గిరిజన కాలనీల్లోని 70 మంది నిరుపేదలకు సారంగం విజయశంకర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు ఛైర్మన్ సారంగం రమేష్‌బాబు, బీజేపీ నాయకులు వాసు, అంబరీషా, శరత్ చంద్రారెడ్డి, సుబ్రహ్మణ్యం, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న రమేష్‌బాబు

సత్ప్రవర్తనతో మెలగాలి



డీఎస్పీ రమణకుమార్‌తో సీఐలు, ఎస్ఐలు

గూడూరు అర్బన్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరంలో ప్రతిఒక్కరు సత్ప్రవర్తనతో మెలిగి శాంతయుత జీవితాన్ని గడపాలని డీఎస్పీ రమణకుమార్ అన్నారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన సంవత్సరం ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ప్రజలు శాంతి భద్రతలకు విఘాతం కల్పించకుండా, ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా ప్రశాంత జీవనం సాగించాలన్నారు. కార్యక్రమంలో సీఐలు శేఖర్‌బాబు, కిషోర్‌బాబు, శ్రీనివాస్, ఎస్ఐలు మనోజ్‌కుమార్, గోపాల్, సురేష్‌బాబు, తిరుపతయ్య, సుబ్రహ్మణ్యంరాజు పాల్గొన్నారు.

కళాశాలకు వంట సామగ్రి వితరణ

సూళ్లూరుపేట, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్త ఏడాది నుంచి జూనియర్ కళాశాలల్లో డొక్కా సీతమ్మ పేరిట మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించేందుకు శ్రీకారం చుట్టనుంది. ఈ నేపథ్యంలో టీడీపీ నేత, ప్రముఖ పారిశ్రామిక వేత్త కొండేపాటి గంగప్రసాద్ దంపతుల సహకారంతో సూళ్లూరుపేట జూనియర్ కళాశాల విద్యార్థులకు భోజన ప్లేట్లు, గ్లాసులతో పాటు వంట పాత్రలను ప్రిన్సిపాల్ శ్యామ్‌కుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆకుతోట రమేష్, దంతాల రవి, ఆరణి చంద్రమోహన్, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్‌కు వంట సామగ్రి అందజేస్తున్న కొండేపాటి గంగాప్రసాద్ దంపతులు, టీడీపీ నాయకుడు రమేష్ తదితరులు

2025లో నా ప్రాధాన్యాలు కొరిడి, పేర్నాడు రోడ్డు నిర్మాణం

ఎమ్మెల్యే విజయశ్రీ



1 కొరిడి, పేర్నాడు రోడ్డు సమస్యకు పరిష్కారం

పులికాట్ తీర గ్రామాలకు రోడ్డు సౌకర్యం కోసం దశాబ్దాలుగా అక్కడి ప్రజలు పోరాడుతున్నారు. పులికాట్ సరస్సు వన్యప్రాణి విభాగం పరిధిలో ఉండడంతో రోడ్డు నిర్మాణానికి అనుమతి ఇవ్వడంలేదు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు వివరించా. కొరిడి, పేర్నాడు గ్రామాలకు ఏడాదిలోగా శాశ్వత రోడ్డు నిర్మాణం పూర్తి చేసేందుకు కృషి చేస్తా.

2 కాళంగి గ్రాయిన్ నిర్మాణం

కాళంగినది, పులికాట్ సరస్సు కలిసేచోట గ్రాయిన్ నిర్మించాలని దశాబ్దకాలంగా స్థానికులు కోరుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వం 2018లో శాశ్వత నిర్మాణం కోసం రూ.3.38 కోట్లు కేటాయించగా, తరువాత ప్రభుత్వం మారిపోవడంతో ఆ ప్రతిపాదన అటకెక్కింది. కూటమి అధికారంలోకి వచ్చాక రూ.12 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేయించాం. ఏడాదిలోగా పనులు పూర్తి చేయిస్తానని విజయశ్రీ తెలిపారు.

3 చెంబేడు చెరువును మినీ రిజర్వాయర్‌గా మార్చడం

చెంబేడు చెరువు కింద సుమారు 15వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఆ చెరువును ఆధునికీకరించి మినీ రిజర్వాయర్‌గా మార్చితే రైతులకు ఎంతో ఉపయోగపడుతుంది. ఇందుకోసం రూ.30 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధంచేసి ప్రభుత్వానికి పంపాం. అనుమతి రాగానే పనులు చేపడతాం.

భక్తులతో పోటెత్తిన పెంచలకోన



స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి వున్న భక్తులు

రాపూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పెంచలస్వామి నామస్మరణలతో పెంచలకోన క్షేత్రం మార్మోగింది. కొత్త సంవత్సరం వేళ తమ ఇష్టదైవాన్ని దర్శనం చేసుకునేందుకు నెల్లూరు, తిరుపతి, కడప జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. బుధవారం తెల్లవారుజాము నుంచే క్యూలైన్లలో బారులుతీరి స్వామి, అమ్మవార్లను దర్శనం చేసుకున్నారు. భక్తుల సౌకర్యార్థం గుడి ఆవరణలో చలువ పందిళ్లు, ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కుటుంబసభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే మండలంలో తూమాయి వద్ద ఉన్న అంకయ్య కొండ గుడి వద్ద భక్తుల రద్దీ నెలకొంది. ఆలయ ధర్మకర్త వేణుగోపాల్‌రెడ్డి క్యాలెండరును ఆవిష్కరించారు.

ఎమ్మెల్యే దంపతులకు సన్మానం



ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల దంపతులను సన్మానిస్తున్న టీడీపీ నేతలు

నాయుడుపేట టౌన్, జనవరి 1(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ, పార్థసారథి దంపతులు, నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి నెలవల సుబ్రహ్మణ్యం, అమృత సరళ దంపతులను ఆ పార్టీ నాయకులు శాలువాలు కప్పి, పూలమాలలతో సన్మానించారు.

కలిసికట్టుగా అభివృద్ధికి పాటుపడదాం: సీపీఎం



కరపత్రాలు అందజేస్తున్న సీపీఎం నాయకులు

గూడూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): కులమతాలకు అతీతంగా అందరం కలిసికట్టుగా ఉంటూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడదామని సీపీఎం నాయకులు అన్నారు. బుధవారం నూతన సంవత్సరం సందర్భంగా ప్రజలందరూ కలిసి మెలిసి ఉండాలని, రాష్ట్రం అభివృద్ధి చెందాలనే దిశగా సీపీఎం పాటు పడుతుందని తెలియజేస్తూ పలు కూడళ్లలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడపలోపలే మతం, గడపదాటితే అందరం భారతీయ సోదరులుగా ముందడుగు వేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శివకుమార్, వెంకట్రామిరెడ్డి, బీవీ రమణయ్య, సురేష్, ప్రసాద్, ముత్యాలయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అందరికీ కార్పొరేట్ వైద్యసేవలు

2025లో నా ప్రాధాన్యాలు

శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్



1 ఉచితంగా కార్పొరేట్ వైద్య సేవలు

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 2025 కొత్త ఏడాదిలో అందరికి ఉచితంగా కార్పొరేట్ వైద్యసేవలు అందించడమే మొదటి ప్రాధాన్యత. ఇందు కోసం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సామర్థ్యాన్ని పెంచడంతో పాటు అదనపు ఉచిత డయాలసిస్ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నా.

2 ముక్కంటి ఆలయ అభివృద్ధి

ముక్కంటి ఆలయాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడమే రెండో ప్రాధాన్యతా అంశం. రానున్న మహాశివరాత్రి లోపు యుద్ధప్రాతిపదికన ఆలయం వద్ద పార్కింగ్ వాహనాల మళ్లింపు కోసం 40అడుగుల రోడ్డును నిర్మించబోతున్నాం. అలాగే రూ.250 కోట్లతో మాస్టర్ ప్లాన్ పనులు పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కసరత్తు చేస్తున్నాం. ముక్కంటి రద్దీని రెట్టింపు పెంచడమే ధ్యేయంగా పనిచేస్తున్నా.

3 పారిశ్రామికాభివృద్ధి

నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపన, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి నా మూడో ప్రాధాన్యత. మన్నవరం భెల్ కు కేటాయించిన భూముల్లో నిరుపయోగంగా ఉన్న కొంతభాగాన్ని వెనక్కు తీసుకోబోతున్నాం. ఇక్కడ మూడు పరిశ్రమలు నెలకొల్పబోతున్నాం. గడ్డి, వెదురు సాగుతో రైతుల ఆదాయం పెంచుతా. వీటన్నింటినీ ఆరు నెలల్లో పూర్తి చేయిస్తా.

పర్యాటకాభివృద్ధికి కృషి

2025లో నా ప్రాధాన్యాలు

సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



1 రహదారుల అభివృద్ధి

నియోజకవర్గంలో రహదారులను అభివృద్ధి చేయిస్తా. కాజ్‌వే నిర్మాణాలను పూర్తి చేయిస్తా. పాఠశాలలు, వసతి గృహాల్లో మౌలిక వసతులను కల్పిస్తా.

2 నిర్మాణ పనుల పూర్తి

రాబోయే ఆరు నెలల కాలంలో అసంపూర్తి నిర్మాణాలను పూర్తి చేయించ డానికి సమగ్రమైన ప్రణాళికలతో ముందు కెళ్తున్నా. పర్యాటకాభివృద్ధికి సంబంధించి అరణియార్ ప్రాజెక్ట్ వద్ద నిర్మాణంలో ఉన్న వ్యూ టవర్, బోటింగ్ నిర్మాణ పనులను పూర్తి చేయిస్తా.

ముక్కంటి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



శ్రీకాళహస్తి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని బుధవారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కిరణ్మయి మందవా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారికి ఆశీర్వచనం ఇచ్చి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి న్యాయస్థాన న్యాయమూర్తులు శ్రీనివాస్‌నాయక్, కృష్ణప్రియ, ఆలయ అధికారులు కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, నాగభూషణంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి పాల వ్యాన్ బోల్తా



కేవీబీపురం, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని సదాశివపురం వద్ద బుధవారం తెల్లవారు జామున నెల్లూరు నుంచి పిచ్చాటూరుకు వెళ్తున్న పాల వ్యాన్ అదుపు తప్పి పొలాల్లో బోల్తా పడింది. స్వల్పగాయాలతో డ్రైవర్ బయటపడ్డాడు. వ్యాన్ ఖాళీగా ఉండటంతో ఎలాంటి నష్టం జరగలేదు. సదాశివపురం చెరువు గట్టు మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక్కడ పెద్దసూచిక బోర్డులను ఏర్పాటు చేస్తే కొంత వరకు ప్రమాదాలను నివారించవచ్చు.

సీఎంకు ముక్కంటి ప్రసాదాలు

ఏర్పేడు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును విజయవాడలోని క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి ముక్కంటి ప్రసాదాలను అందజేశారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



బీఎన్‌కండ్రిగ ఈసీఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు, ప్రసన్న వెంకన్న ఆలయంలో ప్రత్యేక పూజలు - నారాయణవనం కల్యాణ వెంకన్న ఆలయంలో రద్దీ

బుచ్చినాయుడుకండ్రిగ, జనవరి 1 ఆంధ్రజ్యోతి): ఆంగ్ల సంవత్సరాది వేడుకలను మండల ప్రజలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం రాత్రి నుంచే కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. బుచ్చినాయుడుకండ్రిగ ఈసీఐ, చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేసి కేక్‌ను కట్ చేశారు. పట్టణంలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి, నీర్పాకోటలోని చెంగాళమ్మఆలయం, పచ్చాలమ్మ కాలనీలోని పచ్చాలమ్మ గుడి, ఆలత్తూరులోని అంకాళమ్మ ఆలయాలల్లో ప్రత్యేక పూజలు నిర్వహించగా ప్రజలు స్వామిఅమ్మవార్ల సేవలో పాల్గొన్నారు. ఎస్‌ఐ విశ్వనాథ నాయుడు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పిచ్చాటూరు: మండలంలోని రామగిరి వాలీశ్వర స్వామి ఆలయం, కీళపూడి జలకంఠేశ్వర ఆలయం, రజానగరం కోదండరామస్వామి ఆలయాలు బుధవారం నూతన ఏడాదిని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి భక్తులు స్వామివారి దర్శనాల కోసం క్యూ కట్టారు.

నారాయణవనం: పట్టణంలోని కల్యాణ వెంకన్న ఆలయం ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఆలయ అధికారులు ఏర్పాటు చేపట్టారు. తీర్థప్రసాద వినియోగం జరిగింది.

మూడు వాహనాల ఢీ తప్పిన ప్రమాదం

రేణిగుంట, జనవరి 1(ఆంధ్రజ్యోతి) : గొర్రెల మంద రోడ్డుకు అడ్డుగా రావడంతో వాహనం బ్రేక్ వేయడంతో ఒకదాని వెనుక ఒకటి ఇలా మూడు వాహనాలు ఢీకొన్నాయి. కేఎల్‌ఎం ఆస్పత్రి కూడలిలో ఈ ప్రమాదం జరిగింది. ఈ కూడలి వద్ద గొర్రెల మంద రోడ్డు దాటుతోంది. అటువైపుగా వస్తున్న లారీ డ్రైవర్ మందను చూసి బ్రేక్ వేశాడు. వెనుకే వస్తున్న కారు ముందున్న లారీని ఢీకొట్టింది. ఆ వెనుకే వస్తున్న బస్సు కారును ఢీకొనింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతిన్నా ప్రయాణికులు గాయపడలేదు. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. అయితే ఘటనతో ఈ మార్గంలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకుని సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

దుస్తుల పంపిణీ

పిచ్చాటూరు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గౌతమ బుద్ధ యూనివర్సల్ పీస్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ నిర్వాహకుడు దామోదరం కొత్త గొల్లకండ్రిగలో విభిన్న ప్రతిభావంతులైన పిల్లలకు దుస్తులు పంపిణీ చేశారు.

నాయకులకు శుభాకాంక్షల వెల్లువ



బొజ్జల బృందమ్మను , విజయకుమార్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు - కోలా ఆనంద్‌ను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

శ్రీకాళహస్తి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని ఎమ్మెల్యే సుధీర్ తల్లి బొజ్జల బృందమ్మకు పలువురు టీడీపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఊరందూరులోని ఎమ్మెల్యే స్వగృహానికి చేరుకుని బృందమ్మను సత్కరించి కేక్ కట్‌చేయించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, మునిరాజానాయుడు, కంఠా రమేష్, రామకృష్ణయాదవ్, రేణుకమ్మ తదితరులు పాల్గొన్నారు.

● జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ నూతన ఆంగ్ల సంవత్సరం పురస్కరించుకుని దర్శించుకున్నారు. దర్శనానంతరం వేదపండితులు ఆయనను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద పలువురు ఆయనను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి, గరికపాటి రమేష్‌బాబు, గోపాల్, ఎస్వీ రమణ, హరీష్‌రెడ్డి, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్‌ను బుధవారం పలువురు టీడీపీ నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కేవీబీపురం: టీడీపీ సీనియర్ నాయకుడు, పారిశ్రామికవేత్త గంగాప్రసాద్‌ను ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా ఎమ్మెల్యే ఆదిమూలం తన అనుచరులతో మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునస్వామి యాదవ్ తన అనుచరులతో వెళ్లి గంగాప్రసాద్‌ను సన్మానించారు. సత్యవేడు టీడీపీ కోఆర్డినేటర్ శ్రీపతిబాబు, శాప్ డైరెక్టర్ మల్లికార్జునరెడ్డి, జయరామిరెడ్డి, మాజీ ఎంపీపీ మణి, సర్పంచులు దొరబాబునాయుడు, రవి, నాయకులు చెంచయ్య, గోవర్ధన్, వెంకట కృష్ణయ్య తదితరులు కూడా గంగాప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.



బృందమ్మతో తెలుగుమహిళలు

పిచ్చాటూరు: టీడీపీ సీనియర్ నాయకుడు, పారిశ్రామికవేత్త గంగాప్రసాద్‌ను సూళ్లూరుపేటలోని ఆయన నివాసంలో సత్యవేడు నియోజకవర్గ టీడీపీ కో-ఆర్డినేటర్ శ్రీపతిబాబు, తిరుపతి పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు కె.సతీష్‌నాయుడు, పిచ్చాటూరు మండల టీడీపీ అధ్యక్షుడు ఎం.తిరుమలరెడ్డి, వాణిజ్య విభాగ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.పద్మనాభరాజు, బాలరాజు తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు



శ్రీనివాసులుకు కేక్ తినిపిస్తున్న మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జనవరి 1(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డికి పలువురు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం పార్టీ కార్యాలయానికి చేరుకుని ఆయనతో భారీ కేక్ కట్ చేయించారు. అందరికి పంచిపెట్టారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవిం చాలని ఆకాంక్షించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఉన్నం వాసునాయుడు, కోవి చంద్రయ్యనాయుడు, హరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ బాధితురాలికి పింఛన్ అందజేత



బుచ్చినాయుడు కండ్రిగ, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీర్పాకోట గ్రామానికి చెందిన సుజనీ తిరుపతి పద్మావతి ఆస్పత్రిలో డయాలసిస్ చికిత్స పొందు తోంది. ఈ క్రమంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ రూ.10వేలను బుధవారం వీఆర్‌ఓ జగదీష్ ఆస్పత్రికి వెళ్లి ఆమెకు అందజేశారు.

పరశురామేశ్వరుడి సేవలో హాస్యనటులు



ఏర్పేడు, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వరుడి ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని బుధవారం సినీ హాస్య నటులు సత్యం రాజేష్, శ్రీనివాసరెడ్డి, సత్య దర్శించుకున్నారు. వారికి ఆలయ మాజీ చైర్మన్ గిరినాయుడు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జీవగ్రాం చర్చి నూతన కమిటీ

రేణిగుంట, జనవరి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులమండ్యం పంచాయతీ జీవగ్రాం సెయింట్ ల్యూక్ లూథరన్ చర్చి నూతన కమిటీ ప్రమాణస్వీకారం బుధవారం ఘనంగా జరిగింది. పాస్టర్ పి.లూథర్‌బాబు కమిటీ సభ్యుల చేత ప్రమాణస్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా కె.ఏసు రత్నం, కార్యదర్శిగా నిర్మలా చార్లెస్, కోశాధికారిగా పుష్పాంజలి, సభ్యులుగా కె.వి.ఎస్.జయకర్, ఎన్.సతీష్‌బాబు, డి.కె.సంధ్యా రాణి, సి.హెచ్.సుమన్ స్వామిదాస్ ప్రమాణం చేశారు. ఈ కమిటీ కాలపరిమితి మూడు సంవత్సరాలు.

కేంద్ర మంత్రికి ఘనస్వాగతం



మంత్రికి స్వాగతం పలుకుతున్న కడప ఆర్డీవో జాన్ ఇర్విన్

రేణిగుంట, జనవరి 1(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా పర్యటన నిమిత్తం తిరుపతి విమానాశ్రయం చేరుకున్న కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి జితేంద్ర సింగ్‌కు బుధవారం రాత్రి ఘనస్వాగతం లభించింది. కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ అధికారి ఇమ్రాన్, పీసీ రాయులు తదితరులు మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన మంత్రి కడపకు బయలుదేరి వెళ్లారు.